

# కథా కౌముది

## మంత్రిగారొస్తారా?

తమిళ,ఆంగ్ల మూలం : ఉషా మణియన్
అనువాదం: కొల్లూరి సోమ శంకర్

నరేంద్రకి చాలా దాహంగా ఉంది, గొంతెండిపోతోంది.

బొంబాయి నుంచి బికనేర్ సమీపంలోని ఈ ఊరికి బయలుదేరుతున్నప్పుడు మిత్రులు అతడిని హెచ్చరించారు.

"నువ్వు కనీసం అస్సాంలో లేదా ఉత్తర్‌ప్రదేశ్ లలోనైనా బ్రతగలవు, అక్కడ గొడవలు కాని, కాల్పులు కాని, లూటీలు గాని ఎటువంటి పరిస్థితులు ఉన్నా, తినడానికి తిండి, తాగడానికి నీరు దొరుకుతాయి. కాని అక్కడ.. "అంటూ రాహుల్ చెప్పడం ఆపాడు.

నరేంద్ర చిన్నగా నవ్వాడు. 'ఆపేశావే, చెప్పు రాహుల్' అన్నాడు.

కపాడియా అందుకున్నాడు.

"నేను చెబుతా. అక్కడకి వెడితే, నువ్వు ఆకలిదప్పులతో చావాలి!! ముఖ్యంగా ఆ గ్రామం.. దాని గురించి మనం వింటున్న కథలు చాలు. నువు రిపోర్టు రాసివ్వడానికి. నువు స్వయంగా వెళ్ళనవసరంలేదు."

తన మిత్రులు చెబుతున్నదాన్ని నరేంద్ర ఆమోదించలేకపోయాడు.

నీరు, ఆహారంలేకుండా జనాలు అక్కడ పిట్టల్లా రాలిపోతున్నారని విన్నాడతను. పశువులెప్పుడో నశించాయట.

నరేంద్ర కోపంతో రగిలిపోయాడు. అతని హృదయం బరువెక్కింది. 'ఇదసలు ఎలా జరిగింది? ఎందుకు జరిగింది?' అని తనని తాను ప్రశ్నించుకున్నాడు.

ప్రభుత్వమేమో ఆ ప్రాంతంలో అసలు ఆకలి చావులు లేవని, యుద్ధప్రాతిపదికన ఉపశమన చర్యలు తీసుకుంటున్నామని ప్రకటించింది. నరేంద్ర స్వయంగా వెళ్ళి అక్కడి పరిస్థితిని కళ్ళారా చూడాలనుకున్నాడు.

మిత్రుడు రాజారాం రైల్వేస్టేషన్ వరకు తోడుగా వచ్చాడు. అది అతనికెంతో ప్రోత్సాహాన్నిచ్చింది.

నరేంద్ర బికనేర్ చేరాడు. అక్కడి బస్సు, ఎడ్లబండి.. ఏవాహనం దొరికితే, దాంట్లో ఊర్లు తిరిగాడు. ఈ ఊరిలోకి అడుగుపెట్టగానే నిర్ఘాంతపోయాడు.

జీవితంలో మొదటిసారిగా 'దారిద్ర్యరేఖకి దిగువున ఉండడం' అంటే ఏమిటో అర్థమైందతనికి.

ఇంతకుముందు ఊర్లో ప్రయాణ సౌకర్యం దొరకడం కష్టమైంది. ఈ ఊరికి బస్సులు నడపడం మానేసారు. ఓ ఎడ్లబండి అతన్ని అడిగాడు నరేంద్ర. అతను రానన్నాడు. చాలా ఎక్కువ బాడుగ ఇస్తానని నరేంద్ర బ్రతిమాలితే, చివరికి ఒప్పుకున్నాడు.

"ఆ ఊరు దెయ్యాల బీడు బాబూ, ఒకప్పుడు వందమందికి పైగా ఉన్నా ఆ ఊర్లో ఇప్పుడు ఇరవయ్యో, ముప్పైయ్యో ఉన్నారంతే. చాలామంది చచ్చిపోయారు, కొంతమంది వలసపోయారు. గడ్డి దొరకక పశువులు చచ్చిపోతున్నాయి. ఘోరం బాబూ... నిజంగా దారుణం.." చెప్పాడు ఎడ్లబండి నడిపే బోలీ, బండిని నరేంద్ర కోరిన ఊరివైపు నడుపుతూ. నరేంద్ర గట్టిగా నిట్టూర్చాడు.

బోలీ తన బండ్లో మూడు కాసుల నీళ్ళు, కొన్ని సమోసాలు, కొన్ని మిఠాయిలు పెట్టుకున్నాడు. అతని దయార్థ్ర హృదయం నరేంద్రకి నచ్చింది.

"అక్కడ ఎవరైనా చిన్నపిల్లలు ఉండచ్చు కదా బాబు, పైగా మీరక్కడ చాలా సేపు ఉండి ఫోటోలవీ తీసుకుంటే, మీకు ఆకలి వేస్తుంది కదా.." అన్నాడు బోలీ.

ఎంతటి దూరాలోచన రాజకీయ నాయకులకు ఏ మాత్రం తట్టనిది..! నరేంద్ర కూడా బస్ స్టాండ్ నుంచి కొన్ని బిస్కట్ పాకెట్లు తెచ్చుకున్నాడు. బండిమెల్లగా దెయ్యం గ్రామంలోకి ప్రవేశించింది. ఆ ఊరిని చూసిన మొదటి క్షణంలో నరకమంటే ఇదేనేమోననిపించింది నరేంద్రకి. అంతటి భయవహ వాతావరణంలోను, గ్రామం కాస్త సందడిగానే ఉంది.

ఓ టీ కొట్టులోంచి అరిగిపోయిన టేప్ వినిపిస్తోంది. 'మేరే ఆంగనే మే తుమ్హారా క్యా కామ్ హై?' అంటూ అమితాబ్ బచ్చన్ అడుగుతున్నాడు. నరేంద్ర టీ కొట్టువైపు నడిచాడు.

"తాతా, టీ దొరుకుతుందా? " అని కొట్టు యజమానిని అడిగాడు. ఆయనకి దాదాపు ఎనభై ఏళ్ళ వయసుంటుంది.

"ఉంది బాబు. కూర్చోండి" అంటూ అక్కడ ఉన ఓ విరిగిన చెక్క బల్లని చూపాడు. 'మీరు ప్రభుత్వం నుంచి వస్తున్నారా? మంత్రిగారి తరపున వచారా?' అంటూ పీల గొంతుతో ఆశగా అడిగాడు. కళ్ళు కొద్దిగా మెరిసాయి.

"లేదు. నేను విలేకరిని. మీ ఊరి గురించి పేపర్లో రాస్తాను..."

ముసలతను టీ కలిపి ఓ పాత, మట్టికొట్టుకుపోయిన కప్పులో పోసి నరేంద్రకి అందించాడు.

"టీ చెత్తగా ఉంటుంది బాబు, ఏమనుకు్కు. పాలివ్వడానికి మా ఆవుకి గడ్డిలేదు. ఏ మాత్రం లేదు. ఈ రోజు పొద్దున్నే నా కొడుకు, కోడలు, మనవడు కాస్త ఆరోగ్యంగా ఉన్న ఆవుని తోలుకుని వెళ్ళిపోయారు."

"ఎక్కడికి?" అడిగాడూ నరేంద్ర. తేనీరు కషాయం పలచగా, చేదుగా ఉంది. ముసలతను తెలియదన్నట్లుగా నిరాశగా చేతులాడించాడు.

"ఎక్కడికి వెళ్ళారో నాకు ఖచ్చితంగా తెలియదు, మిగతా అందరూ ఎక్కడికి వెళ్ళారో అక్కడికే వెళ్ళుంటారు. పోన్లే. వాళ్ళయినా సుఖంగా ఉంటే అంతే చాలు" టీ చాలా చేదుగా ఉంది, ఈ ముసలతని జీవితంలానే.

"మరి నువ్వెందుకు వెళ్ళలేదు తాతా?"

"హుఁ.... ఎనభై ఏళ్ళ క్రితం నేనీ ఊరి ఒడిలో పడ్డాను. పేగు బంధం ఇంకా తెగిపోలేదు.. నేనిక్కడ పెరిగి పెద్దవాడినయ్యాను, ఈ ఊరి అమ్మాయినే ప్రేమించి పెళ్ళి చేసుకున్నాను. ఈ ఊరి మొత్తానికి నేనే పాలు పోసేవాడిని. మా కొట్టంలో ఎన్నో ఆవులు, గేదలు ఉండేవి. కాని ఇప్పుడిలా... మా దురదృష్టాన్ని అసలు నమ్మలేకపోతున్నాను. మా ఊరి వాళ్ళెందరో నా కళ్ళముందే చనిపోయారు. మా ఆవిడ కూడా ఈ మధ్యే పోయింది. బహుశా నెల రోజులయ్యిందేమో... నా ఆవు, నేను కూడా తొందర్లోనే పోతాం..."

టీ నరేంద్ర గొంతు దిగడంలేదు. కటిక చేదు రుచి పచి లేదు..కషాయం!

"మా ఊరికి మంత్రిగారొస్తారని పదిరోజుల నుంచి అందరు చెప్పుకుంటున్నారు. అందుకే నేను నిన్ను అలా అడిగాను..."

ఇంతలో శుష్కించిన చర్మంతో ఉన్న ఓ యువతి ఎముకల గూడులా ఉన్న ఓ బిడ్డని ఎత్తుకుని అక్కడికి వచ్చింది. "రామ్మా, రా. కూర్చో. ప్యారా ఎలా ఉన్నాడు?" అంటూ ముసలతను అడిగాడు.

ఆమెకి కూడా ఓ కప్పులో టీ కషాయాన్ని అందించాడు. వడలిపోయిన చర్మంతో ఉన్న వణుకుతున్న చేతులతో కప్పుని ఆత్రంగా అందుకుని, ఒక్క గుక్కలో తాగేసింది. ఆమె భుజం మీద పిల్లాడు నిద్రపోతున్నాడు.

"ఏం లాభం లేదు మావయ్యా. ఆయన పరిస్థితి బాలేదు... మెల్లిగా.. మెల్లిగా చచ్చిపోతున్నాడు." ఆమె మాటలింక పూర్తిచేయలేకపోయింది. మాయదారి కరువుకి ఎంత శక్తి ఉందంటే కళ్ళలో తడిని కూడా పీల్చేసినట్లుంది. వాస్తవం... కఠోరమైన వాస్తవం....

ముసలాయనకి యాభై రూపాయల నోటిచ్చి, అక్కడి నుంచి కదిలాడు నరేంద్ర. ఆ యువతి వెంబడి ఊర్లోకి నడిచాడు. ఇళ్ళన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి. బావులన్నీ ఎండిపోయాయి. దూరంగా కొన్ని రాబందులు కనబడ్డాయి. బహుశా పశువుల శవాలని పీక్కుతినడానికేమో. చెట్లు మోడుపోయాయ్. అన్నిచోట్లా చావు వాసనలే.

ఊర్లో ఉన్న కొద్ది మంది మనుషుల కళ్ళల్లో ఏ మాత్రం మెరుపు పేదు. వాళ్ళ జీవితాలలో సంతోషం లేదు, బ్రతకాలన్న ఉత్సుకత లేదు.

రోడ్డు ప్రక్కగా ఓ కుటుంబం కూర్చుని ఉంది. నరేంద్ర వాళ్ళ వైపు వెళ్ళాడు. వాళ్ళేవో మాట్లాడుకుంటున్నారు.

"అమ్మా, మంత్రిగారు నిజంగా వస్తారా?"

"వస్తారు.బాబు. తప్పకుండా వస్తారు. "

"అప్పుడు మనకి నీళ్ళు వస్తాయి కదా, మంత్రిగారు లారీలలో నీళ్ళు తెస్తారు కదూ"

నాలుగేళ్ళ కొడుకు, ముప్పై ఏళ్ళ వయసుండే తల్లిని అడుగుతున్నాడు. వాడి కళ్ళలో ఏదో చిన్నమెరుపు. మరోవైపు ఎండిపోయిన తల్లి రొమ్ముని చప్పరిస్తోంది నాలుగునెలల పాప.

"అమ్మా, మంత్రిగారు రొట్టెలు, మిఠాయిల్ కూడా తెస్తారు కదూ"

"అవును బంగారం"

"నాన్నెప్పుడు వస్తాడు?"

"నువ్వు పడుకో. నువ్వు నిద్రలేచేసరికి నాన్న వచ్చేస్తాడు"

ఆ కుర్రాడు తల్లిని చుట్టూ తిరుగుతున్నాడు. ఆ ఎముకలగూడుకి నిద్రరావడంలేదు.

"అమ్మా"

"ఊఁ!c" ఆమె స్వరంలో నిస్సత్తువ వ్యక్తమవుతోంది.

"అమ్మా, నాన్న కూడా ప్యారా మావయ్యలా చచ్చిపోతే..."

ఆమె చిగురుటాకులా వణికిపోయింది.

"తప్పు బాబు అలా అనకూడదు" అంటూ మంగళసూత్రాన్ని బయటకు తీసి కళ్ళకద్దుకుంది... 'అమ్మోరు తల్లీ...' అంటూ గొణిగింది. దూరంగా ఉన్న దేవాలయం గర్భగుడిలో పార్వతి దేవి వీళ్ళని చూస్తుండిపోయింది. నిశ్శబ్దంగా. పూజరి ఎప్పుడో చచ్చిపోయాడు. దేవి కూడా ఆకలితో ఉంది.. నరేంద్ర ఆమె దగ్గరకి వెళ్ళాడు.

"ఏమ్మా, మీ ఇంటాయన ఎక్కడ పనిచేస్తాడు?'

నరేంద్ర కేసి చూస్తూ, కొంగులో కొంత భాగాన్ని తలమీద కప్పుకుందామె.

"ఇక్కడే స్కూల్లో టీచరు. మంత్రిగారిని కలవడానికి వెళ్ళారు..."

"మీరు రోడ్డు మీద ఎందుకు కూర్చున్నారు? మీకు ఇల్లు లేదా?"

కొన్ని గజాల దూరంలో, గుడి వెనక ఉన్న ఓ ఇంటివైపు వేలు చూపిందామె.

"మా కొట్టంలో రెండు ఆవులు చచ్చిపడున్నాయి, వాటి కంపు భరించలేకపోతున్నాం, పైగా రాబందుల గొడవొకటి.." అని చెబుతూ, "మంత్రిగారొస్తారా?" అని అడిగింది.

"వస్తారు. తప్పకుండా వస్తారు.." చెప్పాడు నరేంద్ర, కనీసం తన అంతరాత్మనైనా సంతృప్తి పరుద్దామని.

నరేంద్ర బోలీని పిలిచి అక్కడున వారందరికి, నీళ్ళు, తినే పదార్ధాలు పంచమని చెప్పాడు బోలీ. బొంబాయి చేరేసరికి నరేంద్ర హృదయం విచారంతో క్రుంగిపోయింది, కోపంతో భగ్గుమంది.

నరేంద్ర తీసిన ఫోటోలకి, రాసిన వ్యాసానికి ఎడిటర్ ఎంతో సంతోషించాడు.

"అదిరిందయా దీన్ని ఫ్రంట్ పేజీలో వేసేద్దాం. సేల్స్ బ్రహ్మాండంగా పెరిగిపోతాయి"

రోతగా అనిపించింది నరేంద్రకి. ఎంతసేపూ అమ్మకాలు... లాభాలు.. డబ్బు... వీటి గురించే ఆలోచిస్తారెందుకో అనుకున్నాడు.

"సరే, నరేంద్ర, నీకు టికెట్లు ఏర్పాటు చేసాను. అలీనోద్యమం సమావేశాలని కవర్ చేయడానికి ప్రతినిధిగా నువ్వు ఢిల్లీ వెడుతున్నావు. సామాన్లు సర్దుకో" చెప్పాడు ఎడిటర్.

కొత్త ఢిల్లీ అందంతోను, సంపదతోను నరేంద్రని ఆహ్వానించింది. హైవేలు, షాపింగ్ కాంప్లెక్సులు, పూలతో నిండిన చెట్లు... ఇవన్నీ అతడిలో కొత్త ఉత్సాహాన్ని నింపాయి.

అతడు సమావేశంలో ఫిడెల్ కాస్ట్రోని దగ్గరగా ఫోటో తీసుకోగలిగాడు. వారం రోజుల తర్వాత అతడికి మంచి నిద్రపట్టింది, అతడి గుండెని ముల్లుతో పొడుస్తున్నట్టుగా ఉన్న బాధ మాయమైంది.

హోటల్లో బ్రేక్‌ఫాస్ట్ అద్భుతంగా ఉంది. నరేంద్ర ఆలోచనలన్నీ నిన్నటి కాస్ట్రో ఉపన్యాసం పైనే ఉన్నాయి. వాస్తవానికి, నరేంద్ర కాస్ట్రో ఆలోచనల గురించి ఇంతకు ముందు పుస్తకాలలో చదివాడు. కొన్ని అతని మనసులో ముద్రించుకుపోయాయి. కొన్ని కన్నీళ్ళు కార్పించాయి. మరికొన్ని సెగలా... అతడి గుండెని మండించాయి.

"ఉన్నవాళ్ళ సంపదని తొలగించి, వాళ్ళని పేద వాళ్ళతో సమానంగా చేయాలనుకోడం మూర్ఖత్వం. నిజమైన విప్లవం ఏంటంటే, ఆర్ధిక స్థాయిని పెంచి, దారిద్ర్య రేఖకి దిగువన ఉన్నవారి జీవిత ప్రమాణాలని పెంచాలి.. వాళ్ళు సౌకర్యంగా ఉండేట్లు చూడాలి.."

ఇంతలో 'డైలీ మార్నింగ్ స్టార్' విలేకరి పార్ధసారధి అక్కడికి వచ్చాడు.

"ఏం నరేంద్ర, దేని గురించో తీవ్రంగా ఆలోచిస్తున్నట్లున్నావు? నీ కప్పులో కాఫీ చల్లారిపోతోంది" అంటూ పలకరిచాడు. నరేంద్ర ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. కప్పులోకి చుసాడు. దాంట్లో కాఫీ కనపడలేదతనికి.

బదులుగా, పల్చగా, మురికిగా ఉన్న కాషాయం కనపడింది.టీ కొట్లో ముసలతను, చచ్చిపోతున్న ప్యారా, రోడ్డుమీద కూర్చున్న కుటుంబం... ఒక్కసారిగా అతడి జ్ఞాపకాలతో వెల్లువయ్యాయి. మంత్రిగారు ఆ ఊరికి వెళ్ళుంటారా?

నరేంద్ర కుర్చీలోంచి పైకి లేచి, కప్పులోని కాఫీని టేబుల్‌పై అందంగా అలంకరించిన ఖరీదైన ఫ్లవర్ వేస్‌లో ఒంపేసాడు. కాఫీ చాలా చిక్కగా, వెగటుగా ఉన్నట్లనిపించిందతనికి.

*కథ నేపథ్యం గురించి సంక్షిప్తంగా:*

*మూల కథని 1984 లో తమిళంలో రాసారు. 1983 లో రాజ్‌స్థాన్‌లో తీవ్రమైన కరువు వచ్చింది. అదే ఏడాది మార్చిలో ఢిల్లీలో అలీనోద్యమం సమావేశాలు జరిగాయి. కథావస్తువు రాజస్థాన్‌లో కరువైనా, దానిని ఇటీవల ఆంధ్రదేశంలో సంభవించిన వరదలతో పోల్చుకోవచ్చు. రెండిటికీ కారణాలు వేరైనా, అటువంటి దుర్ఘటనలు మిగిల్చే విషాదాలు, వెతల ఫలితాలు మాత్రం ఒకేలా ఉంటాయి, వాటికి బలయ్యేది మాత్రం సామాన్యులే. నిస్సహాయులైన ప్రజలు ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రభుత్వ సాయం ఎంతలా కోరుకుంటారో, రాజకీయనాయకులొచ్చి తమను ఆదుకుంటారని ఎంతగా నమ్ముతారో ఈ కథ చెబుతుంది.*